సాక్షి
జగిత్యాల

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



వృద్ధాప్యం.. అనుకోవద్దు భారం

బిడ్డకు దెబ్బతగిలితే కన్నతల్లి తల్లడిల్లుతుంది. పిల్లలు జీవితంలో ఎక్కడ వెనకబడతారోనని తండ్రి అనుక్షణం తపిస్తాడు. తమ కడుపున పుట్టిన వారికోసం సర్వస్వాన్ని అర్పించిన తల్లిదండ్రులకు వృద్ధాప్యం శాపంగా మారుతోంది. జీవిత చరమాంకంలో కన్నబిడ్డలకు భారమై.. అందరూ ఉన్న అనాథలుగా మిగులుతున్నారు. అనాథలకు ఉపయోగపడాల్సిన ఆశ్రమాలు... అందరూ ఉన్న పండుటాకులకు ఆశ్రయమిస్తున్నాయి. అనాథ వృద్ధుల కోసం స్వచ్ఛంద సంస్థలు, రిటైర్డ్ ఉద్యోగ సంఘాలు పనిచేస్తున్నాయి. ప్రభుత్వం కూడా వృద్ధుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు, చట్టాలు అమలు చేస్తోంది. నేడు 'వృద్ధుల దినోత్సవం' సందర్భంగా.. – సాక్షి, కరీంనగర్ డెస్క్

8లో▸

న్యూస్‌రీల్

అసంక్రమిత వ్యాధులను గుర్తించాలి



మాట్లాడుతున్న తేజ్‌కిరణ్

జగిత్యాల: అసంక్రమిత వ్యాధులను గుర్తించి చికిత్స అందించేలా చూడాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి తేజ్‌కిరణ్ అన్నారు. శనివారం స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో అసంక్రమిత వ్యాధులపై అవగాహన సదస్సులో మాట్లాడారు. వ్యాధులను ఎంత త్వరగా గుర్తిస్తే అంత తొందరగా నయం అవుతాయన్నారు. ప్రోగ్రాం అధికారి సమియోద్దీన్ మాట్లాడుతూ చికిత్స తీసుకున్న వారి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని వారి ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. అవసరమైన సలహాలు ఇస్తున్నామన్నారు. డీఎంహెచ్‌వో శ్రీధర్ మాట్లాడుతూ వ్యాధులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రేబిస్‌పై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో

జగిత్యాల: రేబిస్ జంతువుల నుంచి వస్తుందని, వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ అన్నారు. రేబిస్ వ్యాధి, నివారణ వారోత్సవాల సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. రేబిస్‌తో 15 ఏళ్లలోపు పిల్లలకు హాని కలిగే అవకాశం ఉంటుందన్నారు. ఎక్కువగా కుక్కకాటుతో వ్యాధి వచ్చే అవకాశం ఉన్నందున వాటికి వ్యాక్సిన్స్ ఇప్పించాలన్నారు. కుక్క కరిస్తే గాయాన్ని సబ్బుతో కడగాలని, వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు సమియోద్దీన్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, సాగర్ రావు, శ్రీధర్, మురళీధర్ పాల్గొన్నారు.

పాఠశాలలో వేస్ట్ టూ వండర్ ప్రోగ్రాం



వస్తువులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

కోరుట్ల: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పనికి రాని వస్తువుల నుంచి పనికొచ్చే వస్తువులను తయారు చేసి ప్రదర్శించారు. వాటిలో నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపిక చేశారు. వస్తువులు తయారు చేసిన విద్యార్థులందరికీ మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూపతి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, మహేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని విద్యుత్ డీటీఆర్ 87, 34 మరమ్మతు దృష్ట్యా పట్టణంలో ఆదివారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-1 ఏఈ అశోక్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని బాలాజీనగర్, బాలాజీ థియేటర్ వెనుక, పికప్ ఏరియా, శంకర్ హాస్పిటల్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్పౌజ్ దరఖాస్తుదారులు నేడు హాజరు కావాలి

జగిత్యాల: స్పౌజ్ దరఖాస్తుదారులు తాము పొందుపర్చిన ఆప్షన్స్ ప్రింటవుట్ కాపీతో డీఈవో కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్వయంగా హాజరుకావాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. సదరు ఉపాధ్యాయులు సమర్పించిన ఆప్షన్లను ఎంఈవోలతో వెరిఫికేషన్ చేయిస్తామని, విద్యాశాఖ ఆదేశాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో అప్రూవ్ చేస్తామని వెల్లడించారు. ఆదేశాలను విస్మరించి తమ ఇష్టానుసారంగా ఆప్షన్స్ ఇచ్చినట్లయితే విద్యాశాఖ కఠినంగా వ్యవహరిస్తుందని, స్పౌజ్ ప్రాధాన్యత పాయింట్స్ తొలగించడంతోపాటు, సదరు ఉపాధ్యాయులపై సీసీఏ రూల్స్ ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిజిటల్ కీ .. నో వర్కింగ్

- టెక్నికల్ సమస్యే కారణమా..?
- చాలా మున్సిపాలిటీల్లో పరిస్థితి
- ఇబ్బంది పడుతున్న జిల్లా ప్రజలు



జగిత్యాల మున్సిపాలిటీ

జగిత్యాల: మున్సిపాలిటీల్లో ఇంటి అనుమతికైనా.. ఇతరత్రా దేనికైనా ఆ బల్దియా కమిషనర్ సంతకం తప్పనిసరి. పారదర్శక పాలన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మ్యానువల్‌గా కాకుండా ఆన్‌లైన్‌లోనే సర్టిఫికెట్లు అందించాలని నిర్ణయించింది. ఇందుకు ప్రత్యేకంగా డిజిటల్ కీ రూపొందించింది. దీని ద్వారా కమిషనర్లు డిజిటల్ సంతకం చేస్తారు. అయితే సర్వర్‌లో ఏర్పడిన సాంకేతికలోపంతో సదరు డిజిటల్ కీ ఓపెన్ కాకపోవడం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. జిల్లాలోని కొన్ని మున్సిపాలిటీల్లో ఈ సమస్య తలెత్తినట్లు తెలిసింది. తద్వారా ఇంటి అనుమతి, జనన, మరణ ధ్రువీకరణ వంటి సర్టిఫికెట్ల బల్దియాకు వస్తున్న ప్రజలు ఇబ్బంది పడుతుంటే.. సాంకేతికలోపంతో ఓపెన్ కాకపోవడంతో అధికారులు కూడా తలలు పట్టుకుంటున్నారు. ఇది సర్వర్ లోపమా..? లేక సాంకేతిక సమస్యనా..? తెలియడం లేదు. ఈ పరిస్థితి మూడునాలుగు రోజులుగా వేధిస్తోంది.

ఇబ్బందుల్లో ప్రజలు

వివిధ సర్టిఫికెట్ల కోసం ప్రజలు మీసేవలో దరఖాస్తు చేసుకున్న అనంతరం మున్సిపల్ అధికారులు వాటిని పరిశీలించి కమిషనర్‌కు ఫైల్ పెడతారు. కమిషనర్ పరిశీలించి డిజిటల్ సైన్ చేస్తారు. అయితే డిజిటల్ సైన్ ఓపెన్ కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో అనేక సర్టిఫికెట్లు పెండింగ్‌లోనే ఉంటున్నట్లు తెలిసింది. గతంలో పనిచేసిన కమిషనర్ బదిలీ అయి కొత్త కమిషనర్ వచ్చినప్పుడు ఇదే సమస్య తలెత్తింది. పాత కమిషనర్ సంతకం మీదనే సర్టిఫికెట్లు జారీ కావడంతో ప్రజలు కొంత అయోమయానికి గురయ్యారు. సమస్యను వెంటనే పరిష్కరించడంతో ప్రస్తుత కమిషనర్ పేరిటే జారీ అయ్యాయి. రెండు మూడు రోజులుగా మొత్తానికే ఓపెన్ కాకపోవడంతో ప్రజలకు సర్టిఫికెట్లు జారీ కావడం లేదు. అధికారులు స్పందించి డిజిటల్ కీ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం ఇది టెక్నికల్ సమస్యతోనే వస్తుందని, త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొంటున్నారు.

ఆటలకు చోటేదీ..?



బోర్డుకే పరిమితమైన క్రీడా ప్రాంగణం

- మొక్కుబడిగా క్రీడా ప్రాంగణాలు
- చాలాచోట్ల బోర్డులకే పరిమితం
- ఆటలకు గ్రామీణులు దూరం
- పట్టించుకోని అధికారయంత్రాంగం

గొల్లపల్లి: గ్రామీణుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతి గ్రామంలో క్రీడామైదానం ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా రూ.లక్షలు వెచ్చించి క్రీడా ప్రాంగణాలు ప్రారంభించింది. అయితే ఇవే యువతకు అనుకూలంగా లేకపోవడం శాపంగా మారాయి. గతంలో ఏవైనా క్రీడాపోటీలు నిర్వహించాలంటే ఆటస్థలాలు లేక అయితే పాఠశాలల్లో లేదా.. ఇతర ప్రాంతాలను గుర్తించేవారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలతోనైనా సమస్య తీరుతుందని భావించిన యువత, గ్రామీణ క్రీడాకారులకు ఇబ్బందులు మాత్రం తొలగలేదు. క్రీడాప్రాంగణాలు తోరణాలకే పరిమితమవుతున్నాయి. అందులో క్రీడలు ఎలా ఆడేదంటూ యువత ఆవేదన వ్యక్తం చేస్తోంది. జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో కలిపి 419 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత ఏడాది జూన్‌లో అన్ని గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పంచాయతీ, ఈజీఎస్ శాఖల ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు క్రీడా ప్రాంగణాల ఏర్పాటు పనులు చేపట్టారు. అయితే జీపీల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడం.. అరకొరగా ఉన్న స్థలాలు క్రీడాప్రాంగణాలకు సరిపోకపోవడంతో గ్రహణం పట్టినట్లయ్యింది. ఇప్పటివరకు జిల్లాలో 414 క్రీడాప్రాంగణాలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఐదుచోట్ల క్రీడాప్రాంగణాలకు స్థలం లేక పోవడంతో మంజూరుకు నోచుకోలేదు. ఒక్కో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు రెండెకరాల ప్రభుత్వ స్థలం అవసరం. అయితే సదరు క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఖోఖో, లాంగ్ జంప్, కబడ్డీ కోర్టులు, సింగిల్, డబుల్ బాల్‌బాడ్మింటన్ పోటీలకు సదుపాయాలు కల్పించాల్సి ఉంది. అంతేకాకుండా క్రీడాప్రాంగణం చుట్టూ నాలుగు వందల మొక్కల నాటడంతోపాటు, ప్రాంగణం చుట్టూ కంచె ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.2.5 లక్షల నుంచి రూ.3.5 లక్షల చొప్పున కేటాయించారు. గ్రామ పంచాయతీల పరిధిలో స్థలాన్ని చదును చేసి క్రీడాప్రాంగణం అని బోర్డులు ఏర్పాటు చేశారు. అంతేగాకుండా కొన్ని గ్రామ పంచాయతీల్లో కంచె నిర్మించి క్రీడలకు అవసరమైన స్తంభాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ ప్రాంగణాలు క్రీడల నిర్వహణకు అనువుగా లేకపోవడంతో యువత ఆటలకు దూరమవుతున్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న కిట్లు

మండల కార్యాలయాల్లోనే కిట్లు..

తెలంగాణ గ్రామీణ క్రీడలకు సంబంధించిన క్రీడా పరికరాలను ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. ఆయా పంచాయతీలకు సంబంధించిన క్రీడాపరికరాలు, సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేయగా.. అవి మండల పరిషత్ కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. వాలీబాల్, క్రికెట్, లాంగ్‌జంప్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నీస్ క్రీడలకు సంబంధించిన కిట్లు సరఫరా అయ్యాయి. ఇంకా కొన్ని గ్రామాలకు పంపిణీ కావాల్సి ఉంది. అయితే క్రీడాప్రాంగణాలు బోర్డులకే పరిమితం కావడంతో గ్రామీణ క్రీడకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షల విలువ చేసే సామగ్రి, ప్రాంగణాలు యువతకు ఉపయోగపడేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామీణ యువత కోరుతోంది.

సౌకర్యాలు కల్పించాలి



క్రీడాప్రాంగణాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి. చాలా ప్రాంతాల్లో ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. అందులో స్థలం సరిపడా లేకపోవడం.. కొన్ని చోట్ల గ్రామాలకు దూరంగా ఉండడంతో యువత అక్కడికి వెళ్లడం లేదు. మరికొన్ని శ్మశాన వాటికలకు దగ్గరగా ఉన్నాయి. అలాంటి చోట క్రీడలు ఎలా ఆడుతారో అధికారులకే తెలియాలి.

– జగన్, క్రీడాకారుడు, గొల్లపల్లి

క్రీడాకారులను ప్రోత్సహించాలి



గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించేలా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నా.. మైదానాల్లో సరైన సౌకర్యాలు కల్పించడంలో మాత్రం విఫలమైంది. క్రీడలపై గ్రామ యువతకు ఆసక్తి ఉన్నా.. ఆడుకునేందుకు స్థలం మాత్రం లేదు. ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా సామగ్రి వృథా అవుతోంది.

– రఘుపతి, యువకుడు, గొల్లపల్లి

ఎన్నికల సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: ఎన్నికల సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ టీంలకు శిక్షణ నిర్వహించారు. ఎన్నికల విధులు ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే నియమావళి అమల్లోకి వస్తుందని తెలిపారు. ఎన్నికల విధులపై ప్రతి అంశం తెలిసి ఉండాలని, సకాలంలో నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ఫిర్యాదులను 1950 టోల్‌ఫ్రీ నంబరుకు తెలియజేయాలన్నారు. డబ్బు, ఇతర వస్తువులు రవాణా చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అంశాలపై ఎన్నికల సిబ్బంది పాల్గొనద్దని సూచించారు. అనంతరం పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. అదనపు కలెక్టర్ దివాకర, మాస్టర్ ట్రైనర్ తిరుపతి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. జగిత్యాల, ధర్మపురిలో డబుల్‌బెడ్ రూం, మార్కెట్లను పరిశీలించారు. ఈనెల 3న మంత్రి కేటీఆర్ జిల్లాలో పర్యటిస్తున్నారని, ఈ మేరకు పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆమె వెంట ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్లు లత, దివాకర, ఆర్డీవో నర్సింహమూర్తి ఉన్నారు.

సామాజిక మిత్రుల ఔదార్యం

- పోలియో బాధితుడి కుటుంబానికి రూ.1.18 లక్షలు సాయం



దాతల విరాళాలతో ఏర్పాటు చేసుకున్న కిరాణదుకాణం

ధర్మపురి: ఓ వైపు పేదరికం, మరోవైపు పోలియోతో బాధపడుతున్న ఓ కుటుంబానికి అండగా నిలిచారు ఫేస్‌బుక్ మిత్రులు. రూ.1.18లక్షల సాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం పెరికిపాలెం గ్రామానికి చెందిన అలవాల రాజు పుట్టుకతోనే పోలియో బాధితుడు. డీఈడీ చదివిన రాజు కొద్దిరోజులు ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఏడాది నుంచి నడవలేని స్థితికి చేరుకున్నాడు. ఆయన దీనస్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ స్పందించి సెప్టెంబర్ 4న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. స్పందించిన తెలుగురాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, కర్ణాటకకు చెందిన బల్లారి మిత్రులు రూ.1.18 లక్షలు రాజు బ్యాంకు ఖాతాకు పంపించారు. వాటితో రాజు కిరాణదుకాణం ఏర్పాటు చేసుకున్నాడు.

అంగన్‌వాడీల పొర్లు దండాలు



పెగడపల్లి : పొర్లు దండాలు పెడుతూ..



పొర్లు దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు

కోరుట్ల/పెగడపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న సమ్మె 19వ రోజుకు చేరింది. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ శనివారం అంగన్‌వాడీ ఉద్యోగులు కోరుట్లలోని నంది చౌరస్తా వద్ద పొర్లు దండాలు పెట్టారు. వీరి సమ్మెకు వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి గౌడ్, నరేశ్ పాల్గొన్నారు. పెగడపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట పొర్లుదండాలు పెట్టారు. అంగన్‌వాడీల సంఘం నాయకులు జయప్రద, సత్య, రమ, శారద, రాజమణి, లక్ష్మీ, పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి.. ఓ వరం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్



రాయికల్‌లో దరువువేస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. శనివారం జగిత్యాల పట్టణ, అర్బన్, రూరల్, బీర్‌పూర్, సా రంగాపూర్ మండలాలకు చెందిన 236 మందికి రూ.69 లక్షల విలువైన చెక్కులను ఓ గార్డెన్స్‌లో అందజేశారు. సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరంగా మారిందన్నారు. రాష్ట్ర టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రవీణ్, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌లు తదితరులున్నారు.

మినీ స్టేడియం పరిశీలన

మంత్రి కేటీఆర్ ఈ నెల 3న జగిత్యాలలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే సంజయ్, అధికారులు మినీ స్టేడియంను పరిశీలించారు. జగిత్యాలలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సమీకృత మార్కెట్, నూతన ఎస్పీ కార్యాలయం ప్రారంభించి, మినీ స్టేడియంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కులవృత్తులకు ప్రోత్సాహం

రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులకు ప్రోత్సాహం అందిస్తోందని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. శనివారం స్వర్ణకార సంఘం భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలను సమానంగా చూస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కమిషనర్ అనిల్, డీఈ రాజేశ్వర్, స్వర్ణకార సంఘం నాయకులు సత్యం, గిరి తదితరులు పాల్గొన్నారు.

రూ.25 కోట్లతో రాయికల్ పట్టణ అభివృద్ధి

రాయికల్: రూ.25 కోట్లతో రాయికల్ పట్టణ అభివృద్ధికి కృషి చేసినట్లు ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు. మన వార్డు–మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి పట్టణంలోని 1, 9, 10 వార్డుల్లో పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాయికల్ గ్రామ పంచాయతీని సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చొరవతో మున్సిపాలిటీగా మార్చామని, అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఒక్క రూపాయి లంచం అడిగినా చెప్పండి..

దళిత బంధు, గృహలక్ష్మి పథకాల లబ్ధి పొందేందుకు ఎవరైనా ఒక్క రూపాయి లంచం అడిగినా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. రాయికల్ పట్టణంలోని 72 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.20.20 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. జగిత్యాలలో మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఆర్ఎంపీ, పీఎంపీల సంఘ రాయికల్ మండల భవన నిర్మాణం కోసం రూ.5 లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేశారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ఏఎంసీ చైర్మన్ రాణి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, రైతు బంధు సమితి మండల కన్వీనర్ మోహన్‌రావు, కౌన్సిలర్లు కాంతారావు, సువర్ణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐటీఐలో ఐదో దశ అడ్మిషన్లు

జగిత్యాల: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో ఐదో దశ అడ్మిషన్స్ నిర్వహించడం జరుగుతుందని జగిత్యాల ఐటీఐ ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. 2023 సెషన్ కోసం ఎన్సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్స్‌లలో శిక్షణ పొందడానికి రాష్ట్రంలోని ఐటీఐల్లో మొదటి, రెండవ, మూడవ, నాల్గో దఫాల్లో మిగిలిన సీట్లకు ఐదో దఫాలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 1 నుంచి 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలోని జెడ్పీహెచ్ఎస్, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, మోడల్‌స్కూల్స్‌లో 8వ తరగతి చదువుతున్న తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియం విద్యార్థుల నుంచి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. అక్టోబర్ 13 దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ అని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు bsetelangana. జొరి. జీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట ఆందోళన

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట మృతురాలి బంధువులు ఆందోళనకు దిగిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. స్థానిక 12వ వార్డుకు చెందిన వివాహిత(20) మూడునెలల గర్భిణి. నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో ఆమెను సదరు ఆసుపత్రిలో చేర్పించారు. అందులో వైద్యులు పరీక్షలు చేసి డెంగీ జ్వరంగా నిర్ధారించారు. చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి శుక్రవారం విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి మరింత విషమించి ఆమె మృతిచెందింది. దీనికి మెట్‌పల్లి ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపిస్తూ మృతదేహంతో ఆస్పత్రికి వచ్చి ఆందోళనకు దిగారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

ల్యాగలమర్రిలో శతాధిక వృద్ధుడు మృతి


పోచయ్య (ఫైల్)

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని ల్యాగలమర్రి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు నీలి పోచయ్య (110) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లున్నారు. ఆరుగురు మనవళ్లు, ఆరుగురు మనువరాళ్లు, ఎనిమిది మంది మునిమనువళ్లు, ఆరుగురు మునిమనువరాళ్లు మొత్తం 36 మంది కుటుంబ సభ్యులున్నారు. భార్య నరసమ్మ 50 ఏళ్ల క్రితం మృతిచెందింది. 110 ఏళ్లు వచ్చినా ఎంతో ఆరోగ్యంగా ఉండేవాడని ఆరు నెలల క్రితం వరకు తన పనులు తాను చేసుకున్నాడని పేర్కొన్నారు. శనివారం అంత్యక్రియలు పూర్తయినట్లు వృద్ధుడి మనుమడు తిరుపతి తెలిపారు.

వృద్ధాప్యం.. అనుకోవద్దు భారం


నేడు వృద్ధుల దినోత్సవం

కనిపించిన తల్లిదండ్రులే వృద్ధాప్యంలో పిల్లలకు భారమవుతున్నారు. తమ బుజాలపై మోసిన పిల్లలే పెద్దాయ్యాక తల్లిదండ్రులను దూరంగా పెడుతున్నారు. రెక్కలొచ్చిన పక్షుల్లా కన్నవాళ్లను వదిలేసుకుంటున్నారు. అందరూ ఉన్నా అనాథలా మారుతున్న వృద్ధుల్లో చాలా మంది భిక్షాటన చేస్తూ కాలం వెల్లదీస్తుండగా.. మరికొందరు పాడుబడిన భవనాలు, బస్టాపులు, చెట్లకింద, ఆలయాల దగ్గర తలదాచుకుంటున్నారు. ఇలాంటి వారిని వృద్ధాశ్రమాలు చేరదీస్తున్నాయి. ఆకలి తీరుస్తూ.. ఆశ్రయమిస్తున్నాయి. చనిపోతే ఆశ్రమ నిర్వాహకులే కర్మకాండలు పూర్తిచేసి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. – సాక్షి, కరీంనగర్ డెస్క్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తొలి కేసు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సిరిసిల్లలో 2013లో తొలి కేసు నమోదైంది. చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన మొహినవ్వ తనను కొడుకు మల్లేశం పట్టించుకోవడం లేదని ఊరిలో పంచాయితీ పెట్టింది. కోపోద్రిక్తుడైన కొడుకు తల్లిపై దాడి చేసి కాలు విరగొట్టాడు. ఈ సంఘటనపై కరీంనగర్ జిల్లా అప్పటి కలెక్టర్ వీరబ్రహ్మయ్య స్పందించి కేసు నమోదు చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. ఇలా మల్లేశంపై ఉమ్మడి జిల్లాలో తొలి కేసు నమోదైంది. అప్పటి సిరిసిల్ల ఆర్డీవో కే.శ్రీనివాస్ తల్లి పోషణకు ప్రతి నెల రూ.1500 ఇవ్వాలని తీర్పునిచ్చారు. తీర్పును ఉల్లంఘిస్తే జైలుశిక్ష అమలయ్యేలా ఆదేశాలు జారీ చేశారు.

భూమి విక్రయానికి తీర్పు

చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన పెరుక నర్సయ్యను ఆయన కొడుకు రాజయ్య పోషించడం లేదని అడిగినందుకు కొడుకు దాడి చేశాడు. ఈ సంఘటనపై చందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. సిరిసిల్ల ఆర్డీవో భిక్షానాయక్ విచారణ చేపట్టి.. నర్సయ్య సంపాదించిన 20 గుంటల భూమి మార్కెట్ ధర ప్రకారం విక్రయించి, ఆ డబ్బులను నర్సయ్య, స్థానిక వీఆర్వో పేరిట బ్యాంక్‌లో జాయింట్ ఖాతా తెరిచి డిపాజిట్ చేసేలా తీర్పునిచ్చారు. ఆ డబ్బుపై వచ్చిన వడ్డీని నర్సయ్యకు వీఆర్వో ప్రతి నెల ఇవ్వాలని ఆదేశించారు.



ఉమ్మడి జిల్లాలో ఆశ్రమాలు.. ఫోన్ నంబర్లు

ఆశ్రమం పేరు	వృద్ధుల సంఖ్య	ఫోన్‌నంబరు
కరీంనగర్‌లో		
వీరబ్రహ్మేంద్ర అనాథాశ్రమం	45	9949914242
వాసవి వృద్ధాశ్రమం	35	7893185545
భవిత వృద్ధాశ్రమం	10	8790395423
స్పందన వృద్ధాశ్రమం	20	9440421366
సాయికృష్ణ ఆశ్రమం	08	8523842420
సిరిసిల్ల		
మండేపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమం	18	8790822748
లగిశెట్టి విశ్వనాథం వృద్ధాశ్రమం, తంగళ్లపల్లి	21	9440072172
అమ్మ అనాథ వృద్ధాశ్రమం, ఓబులపూర్	4	9866566926
డే కేర్ కేంద్రం, ఎల్లారెడ్డిపేట	8	8790822748
మా ఆశ్రమం గంభీరావుపేట	20	9849830698
జగిత్యాల జిల్లా		
శివగాయత్రి ఆశ్రమం	30	95736 10777
శ్రీ గాయత్రి విశ్వకర్మ వృద్ధుల ఆశ్రమం	30	9440070616
పెద్దపల్లి జిల్లా		
శ్రీధర్మశాస్త్ర వృద్ధాశ్రమం		9346503711

● మలిసంధ్యలో కన్నవారిని కాపాడుకోవాలి ● నిర్లక్ష్యం చేసిన వారికి తప్పదు శిక్ష ● పండుటాకుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు

మలిసంధ్యలో వెలుగురేఖ

అందరి మధ్య ఒంటిరి గువ్వలవుతున్న ఎందరో వృద్ధులకు సిరిసిల్ల పట్టణ శివారులోని చీటి భూంరావు వృద్ధాశ్రమం అండగా నిలుస్తోంది. వారి కుటుంబ సభ్యుల నుంచి చిల్లిగవ్వ ఆశించకుండా.. మలిసంధ్యలో దిక్కులు చూసే వారిని అక్కున చేర్చుకుని ఆత్మీయతను పంచుతోంది. సిరిసిల్ల శివారులోని రగుడు వద్ద రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్‌లోనే చీటి భూంరావు వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు రంగినేని మోహన్‌రావు వారి మామ చీటి భూంరావు పేరుతో వృద్ధాశ్రమాన్ని 2011లో ప్రారంభించారు. ప్రస్తుతం 17 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు.

సకల వసతులు..

వృద్ధాశ్రమంలో 18 గదులున్నాయి. మహిళలకు, వృద్ధులకు వేరు వేరుగా వసతులు కల్పించారు. భార్యాభర్తలుంటే వారికి ఒక్కచోటే రూంలు కేటాయించారు. నిత్యం పిల్లలతో పాటు రెండు పూటలా భోజనం చేస్తూ.. ఒకరితో ఒకరు కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తారు. చేతనైన వారు ఏదైనా వంటకు సాయం చేస్తూ.. ఉంటారు. ఏడేళ్లుగా చీటి భూంరావు ఆశ్రయంలో చాలా మంది ఆశ్రయం పొందారు. ఆశ్రమంలో ఉన్న వారి నుంచి చిల్లిగవ్వ ఆశించడం లేదు.

వృద్ధులకు అండగా శ్రీధర్మశాస్త్ర

గోదావరిఖనిలో అనాథలు, నిరుపేదలకు శ్రీధర్మశాస్త్ర నిత్యన్నదాన వేదిక అండగా నిలుస్తోంది. వందలాది మంది ఆకలి తీరుస్తోంది. కొటం బాబు 2007లో శ్రీధర్మశాస్త్ర నిత్యాన్నదాన వేదికను స్థాపించారు. సింగరేణి సంస్థ సహకారంతో గోదావరిఖని తిలక్‌నగర్‌లో 2012లో శ్రీధర్మశాస్త్ర వృద్ధుల సేవా ఆశ్రమాన్ని 30 మంది అనాథ వృద్ధులతో ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడ 16 మంది వృద్ధులు సేద తీరుతున్నారు.

వయోవృద్ధుల పోషణ చట్టం ఏం చెబుతోంది



వయోవృద్ధుల పోషన సంక్షేమ చట్టం–2007 ప్రకారం తల్లిదండ్రులను ఏ రకంగానైన నిర్లక్ష్యం చేస్తే వారికి మూడు నెలల జైలు, రూ.5వేల జరిమానా విధించే అవకాశం ఉంది. సంతానం లేని వారు తమ ఆస్తులు అనుభవిస్తున్న వారి నుంచి పోషణ ఖర్చులు పొందే హక్కులు కలిగి ఉంటారు. తల్లిదండ్రులను పిల్లలు నిర్లక్ష్యం చేస్తే వారు నేరుగా ఆర్డీవోకు కానీ మీసేవ కేంద్రం ద్వారా కాని ఫిర్యాదు చేయవచ్చు. ప్రిసైడింగ్ అధికారిగా ఆర్డీవో వ్యవహరిస్తారు. తల్లిదండ్రుల ఫిర్యాదుపై సంబంధిత ప్రాంత తహసీల్దార్ క్షేత్రస్థాయిలో విచారణ చేపడతారు. ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ చేస్తారు. న్యాయం జరిగిందని బాధితులు భావిస్తే సమస్య పరిష్కారమవుతుంది. లేదంటే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విషయంలో బాధితులే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు ఆర్డీవోకు ఫిర్యాదు చేయవచ్చు.

తల్లిదండ్రులను పోషించాల్సిందే..



తల్లిదండ్రులను పిల్లలు పోషించాల్సిందే. ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే 2007 వయోవృద్ధుల సంరక్షణచట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. మీసేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకుంటే నోటీసులు ఇచ్చి విచారిస్తాం. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని బట్టి తల్లిదండ్రులకు భత్యం ఇప్పిస్తాం. ఆ చట్టం చాలా కఠినమైంది. కన్నవాళ్లను వారి పిల్లలు బాధ్యతగా పోషించాల్సిందే. – ఎస్.ఆనంద్‌కుమార్, ఆర్డీవో, సిరిసిల్ల

ఒంటరిగా ఉండలేక ఆశ్రమంలో చేరా..



మాది ఇల్లంతకుంట మండలం రేపాక. నా భర్త ఏడాది క్రితం చనిపోయిండు. పనులు చేసుకునేందుకు శరీరం సహకరించ ఊరిలో ఒంటరిగా ఉండలేక ఆశ్రమంలో చేరాను. – రొండ్ల విజయ, ఇల్లంతకుంట

ఎవరూ లేకపోవడంతో ఇక్కడికి వచ్చా..



చాలా రోజుల కింద తమిళనాడు నుంచి ఉపాధి వెతుక్కుంటూ హైదరాబాద్‌కు వచ్చాం. భర్త, నేను ప్రైవేట్ స్కూళ్లలో టీచర్లుగా పనిచేశాం. అనారోగ్యంతో సంవత్సరం క్రితం భర్త చనిపోయాడు. నా ఆరోగ్యం సరిగ్గా లేదు. చూసుకునే వారు ఎవరూ లేకపోవడంతో ఆశ్రమంలో చేరాను. – భారతి, తమిళనాడు

పిల్లలు భారంగా భావించడంతో..



మాది మంత్రాలయం దగ్గర చిన్నపల్లెటూరు. నాకు ఇద్దరు అబ్బాయిలు. ఒకడు వ్యవసాయం చేస్తుంటే.. చిన్న బ్బాయి అమెరికాలో ఉంటున్నాడు. కూతురుకు పెళ్లి అయ్యింది. పిల్లలు భారంగా భావించడంతో దిక్కులేని స్థితిలో ఇక్కడికి వచ్చాను. – సి.శంకరమ్మ, మంత్రాలయం

వృద్ధులకు అండగా ఉండాలని



పిల్లల ఆదరణ దూరమైన వృద్ధులకు మలిసంధ్యలో అండగా ఉండాలని 2011లో మా మామ చీటి భూమారావు పేరిట వృద్ధాశ్రమం పెట్టాం. ప్రస్తుతం 12 మంది ఉన్నారు. ఇటీవల ప్రభుత్వ వృద్ధాశ్రమాలు కూడా ఏర్పాటు కావడంతో అందరూ అటు వైపు వెళ్తున్నారు. ఉన్నవాళ్లకు అన్ని వసతులు కల్పిస్తున్నాం. 12 ఏళ్లుగా వృద్ధాశ్రమాన్ని కొనసాగిస్తున్నాం. – రంగినేని మోహన్‌రావు, ట్రస్ట్ అధ్యక్షుడు

పూర్వజన్మ సుకృతం



నా అనే వారు లేని, ఉన్నా.. పట్టెడన్నం పెట్టే పరిస్థితుల్లో లేని కుటుంబాలకు చెందిన వృద్ధులను చేరదీసి వారికి ఆశ్రయం కల్పించి భోజన వసతి కల్పించే అవకాశం రావడం నా పూర్వజన్మసుకృతం. నాలో శక్తి ఉన్నంత వరకు అనాథవృద్ధులను చేరదీస్తాను. ఆశ్రయం పొందిన వారు జీవితాన్ని ముగిస్తే వారి అంతిమ సంస్కరం కూడా నేనే నిర్వహిస్తున్నాను. – సీపెల్లి వీరమాధవ్, వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమం

పేదల ఆకలి కదిలించింది



నిరుపేదల ఆకలి తీర్చుకునేందుకు పడుతున్న ఇబ్బందులు నన్ను కదిలించాయి. వృద్ధులపై జాలి, దయ లేకుండా వ్యవహరిస్తున్నారు. నేటి సమాజంలో పెద్దలపై పట్టింపు కొరవడుతోంది. ఛీదరింపులు, అవమానాలు పెరుగుతున్నాయి. అందరూ ఉండి ఆశ్రమలకు రావడం బాధగా ఉంటుంది. – కొటం బాబు, శ్రీధర్మశాస్త్ర వృద్ధాశ్రమం నిర్వాహకుడు, గోదావరిఖని

క్రీడలతో క్రమశిక్షణ, ఉత్తమ లక్షణాలు


మార్చ్ ఫాస్ట్ చేస్తున్న జగిత్యాల జట్టు


బెలూన్‌లను ఎగురవేస్తున్న అతిథులు

- కరీంనగర్ కలెక్టర్ డాక్టర్ గోపి
- అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం
- 33 జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్‌లు, రెఫరీల హాజరు

కరీంనగర్‌స్పోర్ట్స్: సుదీర్ఘ శిక్షణ, లక్ష్య సాధనతోనే క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, తద్వారా ఉత్తమ క్రీడాకారులుగా ఎదుగుతారని కరీంనగర్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో శనివారం 9వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీలను పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహిస్తుందని, గతంతో పోలిస్తే ప్రస్తుతం విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు క్రీడల వైపు పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు విముఖత చూపేవారని, ప్రస్తుతం సరైన ప్రోత్సాహం అందిస్తూ పిల్లల వెంట వచ్చి ఉత్సాహం నింపుతున్నారని వివరించారు. తన కూతురును కూడా క్రీడల వైపు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్టాండ్లీ జోన్స్ మాట్లాడుతూ, తెలంగాణ అథ్లెటిక్స్ క్రీడాకారులు దేశంలో ఉన్నతంగా ఎదుగుతున్నారని వివరించారు. జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్ మాట్లాడుతూ, పోటీల్లో విజేతలుగా నిలిచే క్రీడాకారులను హన్మకొండలో జరిగే దక్షిణ భారత అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి, సారంగపాణి, జిల్లా యువజన క్రీడా అధికారి కీర్తి రాజవీరు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 5 కిలోమీటర్ల రన్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు బంగారు, రజత, కాంస్య పతకాలు ప్రదానం చేశారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ


వేడుకల్లో విద్యార్థినులు

మల్యాల(చొప్పదండి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ అద్దం పడుతుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. మల్యాల అడ్డరోడ్డులోని అల్ఫోర్స్ ఎస్ఎస్వీ పాఠశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పూలతో బతుకమ్మలు పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రకృతిని పూజించే గొప్ప సంప్రదాయం తెలంగాణ ప్రజల సొంతమన్నారు. చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలకు అల్ఫోర్స్ విద్యాసంస్థలు పెద్దపీట వేస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన, పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


విష్ణువర్ధన్


హరీశ్

ధర్మపురి: ఇటీవల మెట్‌పెల్లిలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్–20 విభాగంలో ఇద్దరు విద్యార్థులు సత్తాచాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ధర్మపురిలోని మహాత్మ జ్యోతిబాపూలె డిగ్రీ కళాశాలకు చెందిన విష్ణువర్ధన్ 5 కిలోమీటర్ల కాలినడక, హరీశ్ 1,500 మీ టర్ల రన్నింగ్‌లో ప్రతిభచూపారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ రాధాకిషన్, ఫిజికల్ డైరెక్టర్ అంజయ్య, అధ్యాపక బృందం అభినందించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఇందు


ఇందు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని శివరాత్రి ఇందు ఇటీవల జిల్లాస్థాయి అండర్– 17 ఖోఖో విభాగంలో ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అజయ్‌బాబు తెలిపారు. అక్టోబర్ 4న కొడిమ్యాల మండల కేంద్రంలో జరిగే ఉమ్మడి జిల్లా పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఇందును హెచ్ఎం సత్తయ్య, సర్పంచ్ బోనగిరి నారాయణ, ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి అభినందించారు.

మున్సిపల్ అధికారుల విస్తృత తనిఖీలు


జరిమానా రశీదు ఇస్తున్న అధికారి గజానంద్

కోరుట్లటౌన్: కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు శనివారం పట్టణంలోని హోటళ్లు, తినుబండారాలు తయారు చేసే దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా అపరిశుభ్రత, నిషేధించిన ప్లాస్టిక్ క్యారీ కవర్లు ఉన్న దుకాణం యజమానులకు జరిమానాలు విధించారు. పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. శానిటరీ అధికారి గజానందు, రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.